సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

చంద్రంపాలెం హైస్కూల్‌కు సౌండ్ సిస్టమ్ బహూకరణ



పాఠశాలకు సౌండ్ సిస్టం అందించి, మాట్లాడుతున్న బ్యాంకు అధికారి దాస్

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఐడీబీఐ బ్యాంక్ అధికారులు సీఎస్‌ఆర్ కార్యక్రమాల్లో భాగంగా రూ.87వేలు విలువైన సౌండ్ సిస్టమ్ అందజేశారు. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో బ్యాంక్ విశాఖపట్నం డివిజనల్ జనరల్ మేనేజర్ కె.దాస్ హెచ్‌ఎం రవికి దానిని అందజేశారు. బ్యాంక్ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మధురవాడ శాఖ బ్రాంచ్ మేనేజర్ లత, ఉపాధ్యాయులు స్వామి, సోమేష్, బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

కొమ్మాది: విజయవాడలో జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు స్టెల్లా మేరీస్ కళాశాలలో జరిగిన యు–23 బాస్కెట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో సాగర్‌నగర్ బాస్కెట్‌బాల్ అకాడమీకి చెందిన కె. శ్రేష్ఠ, ఆర్.భావనారెడ్డి తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా కోచ్ సునీల్ రెడ్డి మంగళవారం వారిని అభినందించారు.

30 రోజులు మించకుండా వరినారు వేసుకోవాలి



పెద్దిపాలెంలో వరినారు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

తగరపువలస: వరి నారు 30 రోజులు మించకుండా నాట్లు వేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కొత్తూరు అప్పలస్వామి రైతులకు సూచించారు. ఆనందపురం మండలం పెద్దిపాలెం, వెల్లంకి పంచాయతీలలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ఏవో చావా సంధ్యా రత్నప్రభతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరి నారు మడులను పరిశీలించారు. నాట్లు వేసే వారం రోజుల ముందు రెండు నుంచి మూడు పొలాన్ని దమ్ము చేయాలన్నారు. చివరి దమ్ములో ఎకరాకు 50 కిలోల డీఏపీ, 10 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసిన తరువాత నాట్లు వేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.స్వాతి, సహాయ ఏవో జి.రమేష్, రైతులు పాల్గొన్నారు.

మినప పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



నరసాపురంలో రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు

పద్మనాభం: మినప పంటకు పల్లాకు తెగులు సోకినందున సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంపీఎస్ చలం సూచించారు. మండలంలోని తునివలస పంచాయతీ నరసాపురంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పల్లాకు తెగులు సోకడం వల్ల ఆకులు పసుపు రంగులోకి మారి చేను గిడస బారుతుందన్నారు. పసుపు ఆకులు కనిపించిన చెట్లను పీకి పారివేయాలని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ ఎం.తేజ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'లీజు రద్దు చేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష'

సింహాచలం: సింహగిరిపై కల్యాణమండపాల లీజుని పూర్తిగా రద్దుచేయాలని, గత కాంట్రాక్టర్‌కి ఇచ్చిన నెలరోజుల గడువును కూడా ఉపసంహరించుకోవాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి జేఏసీ హెచ్చరించింది. దేవస్థానం అధికారులు స్పందించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు హెచ్చరించింది. జేఏసీ ఆధ్వర్యంలో సింహాచలంలోని తొలిపావంచా వద్ద రెండో రోజు రిలే నిరాహార దీక్షలో జేఏసీ కన్వీనర్ పూడిపెద్ది శర్మ పాల్గొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ కల్యాణమండపాలను లీజుకివ్వడంతో అధిక ధరల వల్ల పేదలు వివాహాలు చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. తాము ఉచితంగా కల్యాణమండపాలు ఇస్తామన్నా దేవస్థానం అధికారులు స్పందించడం లేదన్నారు. గత కాంట్రాక్టర్‌కు దేవస్థానం అధికారులు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు.

- నెల రోజులుగా కురుస్తున్న మంచు
- పైరును ఆశించిన పురుగు
- వెంటాడుతున్న ఎరువుల కొరత
- ప్రైవేట్ డీలర్ల వద్దకు పరుగులు
- ఆందోళనలో అన్నదాతలు



మొక్కజొన్నకు మంచు ముప్పు



కృష్ణాపురంలో మొక్కజొన్న పైరుపై ఆవరించిన మంచు

పద్మనాభం: మంచుతో మొక్కజొన్న పంటకు ముప్పు వాటిల్లింది. నెల రోజులుగా కురుస్తున్న మంచు కారణంగా మొక్కజొన్న పైరును ఆశించిన పురుగు ఆకులు కత్తిరిస్తోంది. దీంతో ఎదుగుదల లోపించి, వెన్నులు సైజు తగ్గి దిగుబడి పడిపోయే ప్రమాదం ఉండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

రైతు సేవా కేంద్రాల్లో దొరకని యూరియా

యూరియా కొరత రైతన్నలను వెంటాడుతోంది. అవసరమైన సమయంలో రైతు సేవా కేంద్రాల్లో యూరియా, దొరక్కపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. రెడ్డిపల్లి, మద్ది గ్రామాల్లోని డీలర్ల వద్దకు యూరియా కోసం పరుగులు తీస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పంటల సమయానికి రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు పుష్కలంగా ఉండేవి. కూటమి ప్రభుత్వ హయాంలో ఎరువులు కావల్సిన సమయానికి లభ్యం కాకపోవడంతో అన్నదాతలు మండిపడుతున్నారు.





మద్దిలో పురుగు ఆశించడంతో కత్తిరించబడిన మొక్కజొన్న

నాడు వర్షం.. నేడు మంచు

మండలంలోని కృష్ణాపురం, మద్ది, పద్మనాభం, తునిపాలెం, ఇనకలపాలెం, పాండ్రంగి, కురపల్లి, విలాస్కాన్‌పాలెం గ్రామాల్లో అన్నదాతలు మొదటిసారి మొక్కజొన్న వేశారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి వేసిన మొక్కజొన్న డిసెంబర్ నెలలో కురిసిన అధిక వర్షాలకు 220 ఎకరాల్లో పోయింది. దీని వల్ల రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు. మళ్లీ రైతులు ఈ గ్రామాల్లో రెండో సారి 560 ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశారు. ఎకరాకు పంట వేయడానికి అన్నదాతలు సుమారు రూ.12వేలు ఖర్చు చేశారు. భూమి దున్నడానికి, విత్తనాలు, డీఏపీ కొనుగోలు చేయడానికి ఈ పెట్టుబడి పెట్టారు. మొక్కజొన్న పంట వేసి నెల రోజులు కావస్తోంది. పంట వేసినపప్పటి నుంచి మంచు దట్టంగా కురుస్తోంది. దీని వల్ల మొక్కజొన్న పంటను ఆశించిన పురుగు ఆకులు కత్తిరిస్తోంది. పురుగు సోకిన మొక్కజొన్న ఎదుగుదల లోపించి వెన్నులు సైజు తగ్గిపోయి దిగుబడి గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉండడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. మొదట వేసిన పంట వర్షార్పణం కాగా రెండో దఫా వేసిన పంట మంచు ప్రభావం వల్ల నాశనం కావడంతో అన్నదాతలకు దెబ్బ మీద దెబ్బ తగిలింది. మంచు ధాటికి పురుగుల బారిన పడిన మొక్కజొన్నను కాపాడుకోవడానికి వారు శాయశక్తులా కృషి చేస్తున్నారు. సస్య రక్షణ చర్యలు చేపట్టే పనిలో నిమగ్నమయ్యారు



మద్దిలో మొక్కజొన్న పైరుకు సస్య రక్షణ చర్యలు చేపడుతున్న రైతు

పైరు ఎదుగుదల లేదు



మొక్కజొన్న సాగుకు కాలం కలిసిరావడం లేదు. మొదటి సారిగా ఎకరం విస్తీర్ణంలో మొక్కజొన్న పంట వేశాను. సుమారు రూ.12వేలు పెట్టుబడి పెట్టాను. డిసెంబర్‌లో కురిసిన వర్షానికి పంట మొత్తం పోయింది. దీంతో పెట్టుబడి పోయింది. మళ్లీ రెండోసారి ఎకరం విస్తీర్ణంలో మొక్క జొన్న పంట వేశాను, మళ్లీ రూ.12వేలు పెట్టుబడి పెట్టాను. పంట వేసినప్పటి నుంచి మంచు దట్టంగా కురుస్తోంది. మంచు వల్ల పైరును ఆశించిన పురుగు ఆకులను కత్తిరిస్తోంది. పైరు ఎదుగుదల లోపించింది. వెన్ను సైజు తగ్గి దిగుబడి తగ్గిపోతోంది.

– టి.బంగారునాయుడు, కృష్ణాపురం

రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు ఉండట్లేదు



రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు సరిగా లభ్యం కాలేదు. దీనివల్ల ఇబ్బందులు పడుతున్నాం. నేను 80 సెంట్ల విస్తీర్ణంలో మొక్కజొన్న పంట వేశాను. మొక్కజొన్న పంటకు యూరియా, డీఏపీ అవసరం. పంటకు వేయడానికి అవసరమైన సమయంలో ఎరువులు లభ్యం కాలేదు. దీంతో దూరంగా ఉన్న రెడ్డిపల్లి ప్రైవేట్ డీలర్ వద్దకు వెళ్లి ఎరువులు తెచ్చుకుంటున్నాం. ఎరువులు తెచ్చుకోవడానికి వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తోంది

– ఎం.గురునాయుడు, కృష్ణాపురం

కొనసాగుతున్న రామాయణ ప్రవచనాలు



ప్రవచనానికి ముందు సీతారాములకు పూజ చేస్తున్న చాగంటి

మధురవాడ: దేశంలో నగరములకు, నదులకు, పర్వతములకు అధిష్టాన దేవతలు ఉంటారని, వారు తప్పక అనుగ్రహిస్తారనే విషయమును శ్రీరామాయణం మనకు తెలియజేస్తుందని ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు చెప్పారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో సంపూర్ణ శ్రీరామాయణంపై మంగళవారం 11వ రోజు ప్రవచించారు. వనవాసానికి బయల్దేరే సమయంలో తిరిగి క్షేమంగా రావాలని శ్రీరాముడు అయోధ్య నగరానికి, సీతమ్మ గంగమ్మకు మొక్కుకున్నారన్నారు. వారిని భరద్వాజ మహర్షి చిత్రకూట పర్వతం వద్ద ఉండమని తెలిపారని, ఆ పర్వత శిఖరం దర్శనం చేతనే పాపం చేయాలన్న ఆలోచన కలగదని చెప్పడం అధిష్టాన దేవతల గొప్పదనం సూచిస్తుందన్నారు. శ్రీరాముడిని గుహుడు కలుసుకోవడం, అయోధ్యకు సుమంతుడు తిరిగి వెళ్లడం, దశరథ మహారాజు శాపం, ఆయన మరణం తదితర విషయాలను వివరించారు. ప్రవచన కార్యక్రమానికి ముందు ఆయన సీతారాముల విగ్రహాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో చాగంటి కోటేశ్వరరావు సతీమణి సుబ్రహ్మణ్యేశ్వరి, నిర్వాహకులు అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణమూర్తి, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకాశం.. వర్ణశోభితం



మారికవలస వద్ద మంచు తెరలు తొలగుతున్న క్రమంలో కనిపించిన దృశ్యం

మధురవాడ: రథ సప్తమి రోజు ఆకాశం వర్ణ శోభితంగా దర్శనమిచ్చింది. దట్టంగా అలముకున్న మంచు తెరలను ఉదయ భానుడు బలంగా చీల్చుకుంటూ వస్తున్న క్రమంలో కొమ్మాది–మారికవలస జంక్షన్‌ల మధ్య ఆకాశంలో వివిధ వర్ణాలు శోభాయమానంగా కనిపించాయి.

డంపింగ్‌యార్డ్ నుంచే బయో మైనింగ్ వ్యర్థాల తరలింపు



నమ్మివానిపేటలో ఇక్కడి నుంచే వ్యర్థాలు తరలించారు



తగరపువలసలో శ్మశానవాటికకు తరలించి చదును చేసిన వ్యర్థాలు

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు గోస్తనీనది వద్ద శ్మశానవాటికను పూడ్చడానికి నమ్మివానిపేట డంపింగ్‌యార్డులోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నుంచే బయో మైనింగ్ వ్యర్థాలను తరలించినట్టు ప్రాథమిక విచారణలో తేలింది. ఇటీవల తగరపువలస హిందూ శ్మశానవాటికను చెత్తతో పూడ్చిపెట్టడంతో ఈ ప్రాంత హిందువులలో అలజడి రేగింది. అంతేకాకుండా కూటమి నాయకులలో విభేదాలు కూడా బయట పడ్డాయి. వాస్తవానికి డంపింగ్‌యార్డులోని గార్బేజ్ స్టేషన్ వద్ద చెత్తను స్వీడన్‌కు చెందిన బయో మైనింగ్ యంత్రంతో వేరు చేయవలసి ఉంది. తరువాత ఇక్కడి నుంచి మట్టిని బయటకు తరలించాలి. కానీ కాంట్రాక్టర్ యంత్రంతో చెత్తను వేరు చేయకుండానే జీవీఎంసీకి నష్టం కలిగే విధంగా కాపులుప్పాడ వద్ద కొండపైన, తగరపువలస శ్మశానవాటికకు తరలించి చేతులు దులుపుకొన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల రాత్రి వేళ డంపింగ్‌యార్డు నుంచి బయో వ్యర్థాలను తగరపువలస తరలిస్తుండగా పోలీసులు కూడా ప్రశ్నించినట్టు తెలిసింది. ఇదే సమయంలో లారీలతో వ్యర్థాలను తరలించినప్పుడు శ్మశానవాటిక ప్రహరీ కూడా దెబ్బతింది. ఇందులో కొందరు కూటమి నాయకులకు ప్రయోజనం అందినట్టు ఆరోపిస్తున్నారు. డంపింగ్‌యార్డు నుంచి అనుమతి లేకుండా రాత్రి వేళ తరలించిన బయోవ్యర్థాల గుట్టు వీడాలంటే అక్కడి సీసీ ఫుటేజీని తనిఖీ చేయాలని కొందరు కూటమిలోని నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

దినకరా..శుభకరా

- ఆదిత్యునికి ప్రత్యేక పూజలు
- భక్తిశ్రద్ధలతో రథసప్తమి



సూర్య దేవునికి పూజలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



ఎండాడ పార్కులో సూర్య నమస్కారాల్లో పాల్గొన్న వాకర్స్

భీమునిపట్నం: రథసప్తమి పర్వదినం సందర్భంగా ఆదిత్యునికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. భీమిలి కృష్ణాకాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద అర్చకులు అప్పలాచార్య ఆధ్వర్యంలో స్వామివారిని సప్తాశ్వ రథంపై ఉంచి విశేషపూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు రేలంగి పెదబాబు, కె.ముత్యాలరావు, మొకర శంకర్, జి.సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆదిత్యుడికి అభిషేకాలు

మధురవాడ: మధురవాడ జోనల్ ఆఫీసు సమీపంలోని సిద్ధేశ్వర స్వామి పీఠం నవగ్రహ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్య భగవానుడికి పంచామృత అభిషేకాలు చేశారు.

పార్కులో సూర్య నమస్కారాలు

కొమ్మాది: ఎండాడ పార్కులో మంగళవారం ఉదయం 5.30 గంటలకు శ్రీ పోలమాంబ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు నిర్వహించారు. యోగా గురువు రాజేష్ రెడ్డి వాకర్లతో 12 ఆసనాలు వేయించారు. సూర్య నమస్కారాలవల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

'దుర్గాలమ్మ ఆలయ రహదారి మూయడం సరికాదు'

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు సంగివలసలో సర్వే నంబర్లు 25/6, 23/9లలో దుర్గాలమ్మ ఆలయానికి వెళ్లేసుమారు అర కిలోమీటరు రహదారిని మూసివేయడం తగదని వలందపేట, సంగివలస గ్రామస్తులు ఆరోపించారు. మంగళవారం వీరు ఆలయం వద్ద మాట్లాడారు. 1959లో ఏపీ గెజిట్‌లో సంగివలస గ్రామ మ్యాప్ లో బండిబాటగా, 1960లో తయారు చేయబడిన ఎఫ్‌ఎంబీలో రహదారిగా మార్కు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ సర్వే నంబర్లలో పట్టాదారులుగా, అడంగల్‌లో పేర్లు నమోదు చేయబడిన వారు లేదా వారి పూర్వీకులు గతంలో ఎన్నడూ పట్టాదారులుగా లేరన్నారు. సర్వే నం.25/6 రహదారి వెంబడి మురుగు కాలువను గతంలో కొందరు అడ్డుకోవడం వలన మురుగు పొంగి ప్రజలకు హాని కలుగుతోందన్నారు. ఇప్పుడు ఆలయానికి వెళ్లే భక్తులను అడ్డుకుంటున్నారన్నారు. దీనిపై వీఆర్వో, ఆర్‌ఐలు బాధితులతో పాటు సంగివలస గ్రామస్తుల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారన్నారు. సమావేశంలో చోడిపల్లి గంగాధరరావు, నాగరాజు, సూరిబాబు, చందక సూరి, కోనాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టును ఆశ్రయిస్తాం: దీనిపై తోణంగి అప్పయ్యమ్మ మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌టీ ప్రకారం తన తల్లిగారైన చిల్ల ముత్యాలమ్మ నుంచి 2018 జూన్‌లో సర్వే నం.25/6లో తన కుమారుడు నరసింగరావుకు 35 సెంట్లు దఖలు పడిందన్నారు. ఆలయానికి వెళ్లేందుకు భక్తుల కోసం తన కుమారుడు 10 అడుగుల వెడల్పు రహదారి వదిలేశాడని, రియల్ ఎస్టేట్ వ్యాపారులు మాత్రం 35 సెంట్లు జిరాయితీ స్థలాన్ని అడుగుతున్నారని తెలిపారు. న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు.

జీవన శైలిలో మార్పులే క్యాన్సర్‌కు కారణం

- జాగ్రత్తలు పాటిస్తే జయించగలం
- వైద్యుల సూచనలు
- వాడవాడలా అవగాహన ర్యాలీలు



వేములవలస కూడలిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామీణ వైద్యులు



డాక్టర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

తగరపువలస: జీవన శైలిలో మార్పులు, వాతావరణ కాలుష్యం క్యాన్సర్‌కు ప్రధాన కారణమని గ్రామీణ వైద్యుల ఉత్తరాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి అన్నారు. అవగాహన, తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా క్యాన్సర్‌ను జయించవచ్చని చెప్పారు. ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఆహార అలవాట్లలో మార్పులు చేసుకోవాలని సూచించారు. గుట్కా, పాన్‌మసాలా, జర్దా వంటివి మానుకోవాలన్నారు. మహిళలలో అధిక రక్తస్రావం, చాతీలో గడ్డలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. ర్యాలీలో పాల్గొన్న ఆనందపురం ట్రాఫిక్ ఎస్‌ఐ పి.పాపారావు మాట్లాడుతూ క్యాన్సర్‌పై అన్నివర్గాల ప్రజలకు అవగాహన అవసరమన్నారు. ర్యాలీలో గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు పోతిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి కె.ఎస్.రావు, పచ్చిపులుసు కనకారావు, రఘు, వినోద్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న క్యాన్సర్ ముప్పు

భీమునిపట్నం: క్యాన్సర్ ప్రాణాంతకమైన వ్యాధి అని, దీని గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని భీమిలి ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యుడు ఫణికుమార్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కలిసి మంగళవారం నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ప్రస్తుత మన జీవనశైలి, కలుషిత ఆహారాలు, వాతావరణాల వల్ల క్యాన్సర్ ముప్పు పెరుగుతోందన్నారు. దీన్ని అడ్డుకుని ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ కొన్ని కచ్చితమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా దీర్ఘకాలికంగా మానని రోగాలు, పుండ్లు ఉంటే వెంటనే క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన మేరకు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్యాన్సర్‌ను ముందే గుర్తిస్తే దాన్ని నయం చేసుకోవచ్చని తెలియజేశారు.

గీతంలో సదస్సు

కొమ్మాది: ప్రస్తుతం జీవన విధానంలో వస్తున్న మార్పులే క్యాన్సర్ వ్యాధికి ప్రధాన కారణమని ఒమేగా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, అంకాలజిస్టు డా. బి. రవిశంకర్ అన్నారు. మంగళవారం గీతంలో జరిగిన ఓ సదస్సులో ఆయన ప్రసంగించారు. ముఖ్యంగా పొగ తాగటం, మద్యం సేవించడం, అతిగా ఫాస్ట్‌ఫుడ్‌లకు అలవాటు పడటం వంటివి క్యాన్సర్‌కు దారి తీస్తాయన్నారు. దేశంలో ఏటా 1.4 కోట్లు మంది జనాభా క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారని, వారిలో 90 లక్షల మంది వ్యాధి తీవ్రతను ఎదుర్కొంటున్నారని తెలిపారు.

బంగ్లామెట్ట పాఠశాలలో..

తగరపువలస: ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న మరణాలలో క్యాన్సర్ వ్యాధి రెండో కారణమని బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరహరిశెట్టి రమేష్ అన్నారు. పాఠశాలలో నిర్వహించిన క్యాన్సర్ వ్యాధి అవగాహన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు పలు అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఈగల సంజీవి పాల్గొన్నారు.

కల్యాణమండపం నిధుల దుర్వినియోగంపై విచారణ

పరవాడ: మండలంలోని వెన్నలపాలెంలో నిర్మించిన కల్యాణ మండపం నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదు మేరకు అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషరాణి మంగళవారం గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి ప్రాథమిక విచారణ జరిపారు. పంచాయతీలోని కల్యాణమండపం ద్వారా వచ్చిన సుమారు రూ.15 లక్షల నిధులు దుర్వినియోగం అయ్యాయని గ్రామానికి చెందిన గొంప మారునాయుడు డీపీవోకు గత డిసెంబర్ 30న ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆమె ప్రాథమిక విచారణ నిర్వహించారు. ఈ విచారణలో పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన మల్లికార్జునరావు, వరలక్ష్మిలను విచారించారు. 2019 నుంచి కల్యాణమండపం లావాదేవీలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

నాలుగో సారి ఓవరాల్ చాంపియన్‌షిప్

పాలిటెక్నిక్ విద్యార్థినులకు అభినందన



ట్రోఫీలతో విద్యార్థినులు

భీమునిపట్నం: భీమిలి మహిళా పాలిటెక్నిక్ విద్యార్థినులు క్రీడా పోటీల్లో వరుసగా నాలుగో సారి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మురళీకృష్ణ అన్నారు. విజేతలైన విద్యార్థినులను కళాశాల వద్ద మంగళవారం అభినందించారు. విశాఖలో ఇటీవల నిర్వహించిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ స్టేట్‌లెవెల్ మీట్‌లో 17 మంది విద్యార్థినుల బృందం పాల్గొని అనేక పతకాలు సాధించినట్లు చెప్పారు. ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్‌లో ప్రథమ స్థానం, 800మీటర్ల పరుగులో ద్వితీయ, షాట్‌పుట్‌లో తృతీయ స్థానం పొందినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 138 కళాశాలలు పాల్గొన్న ఈ పోటీల్లో విద్యార్థినులు ఓవరాల్ చాంపియన్ షిప్, గేమ్స్ చాంపియన్‌షిప్ కూడా సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు పట్టని ఎన్నికల కోడ్

మధురవాడ: పార్టీల కార్యకర్తలే కాదు..అధికారులు కూడా స్వామిభక్తిని విశేషంగా ప్రదర్శిస్తున్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే పార్టీల ఫ్లెక్సీలు తొలగించి, నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని నిబంధన ఉన్నా మధురవాడ పరిసర ప్రాంతాలలో జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదు. అందుకు నిదర్శనం ఈ చిత్రాలే.

- జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న విద్యుత్ శాఖ విశాఖ జోన్–3 కార్యాలయం ప్రధాన గేటు వద్ద టీడీపీ ఫ్లెక్సీ నెలల తరబడి దర్శనం ఇస్తోంది. ఇందులో ఎమ్మెల్యేతో పాటు విద్యుత్ శాఖ అధికారి ఫొటోలు ఉన్నాయి.
- కార్‌షెడ్ జంక్షన్‌లో కార్పొరేటర్ ఫ్లెక్సీని తొలగించకుండా ఫ్లెక్సీకి వింతగా ముసుగు వేశారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎన్నికల నియమావళిని అనుసరించాలని పలువురు ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు.



విద్యుత్ శాఖ జోన్-3 కార్యాలయం మెయిన్ గేటుకు ఎమ్మెల్యేతో కలిపి ఉన్న ఆ శాఖ ఈఈ ఫ్లెక్సీ



స్వతంత్రనగర్ వార్డు సచివాలయం ఎదురుగా ఉన్న జనసేన ఫ్లెక్సీ